## ఇంటికి అతిథులు వస్తే....

* ఇంటికి అతిథులు వస్తే చిరునవ్వుతో ఆహ్వానించటం ఆ ఇంటివారి ప్రథమ కర్తవ్యం.
* వచ్చినవారికి మంచినీళ్ళు కావాలేమో అడిగి, వారిని కూర్చోపెట్టి కుశలప్రశ్నలు అడగాలి.
* అతిథులతో సరళంగా, మృదువుగా, ఆప్యాయంగా సంభాషించాలి.
* అతిథులతో మాట్లాడేటప్పుడు తమ గొప్పతనాన్ని, భర్తను, పిల్లలను గురించి, ఎంతసేపూ ఒకే ధోరణిలో తమ కుటుంబాన్ని గురించే చెప్పకూడదు.
* మాటలలో సహజత్వం ఉండాలి, అంతేకానీ అతిశయంగా మాట్లాడటం, బడాయి కబుర్లు చెప్పడం అతిథులకు విసుగును కలిగిస్తుంది.
* అతిథులు ఇంట ఉన్న సమయంలో ఇంట్లో ఇతర కుటుంబ సభ్యులతో కలహించటం, పిల్లలమీద ఆగ్రహించటం సభ్యతకాదు.
* పనిమనిషిమీద విసుక్కోవటం, తిట్టడం, సూటీపోటీ మాటలనడం అతిథులకు బాధ కలిగిస్తుంది.
* ఇతరులను గురించి అతిథులముందు తేలికగా మాట్లాడటం, విమర్శించటంవల్ల అతిథులు తమ చాటుగా తమనుగురించి వీరు ఇల్లాగే చెప్తారని అపోహ పడవచ్చు. అందువల్ల ఇతరులను తక్కువచేసి, అతిథులముందు మాట్లాడకూడదు.
* ఇంటికి వచ్చిన అతిథులకు కాఫీ, ఫలహారాలను ఇవ్వడం మర్యాదే అయినప్పటికీ, వారు వద్దంటే వారిమీద ఒత్తిడి తేవటం, తీసుకోనందుకు నిష్ఠూరంగా మాట్లాడటం అతిథులకు బాధ కలిగిస్తుంది.
* అతిథుల ఎదురుగా కుటుంబసభ్యులు చర్చలు, వాదోపవాదాలు చేయకూడదు.
* ఇంటికి వచ్చిన అతిథులతో మాట్లాడకుండా పుస్తకం చదువుతూనో. పని చేసుకుంటూనో రేడియో వింటూనో గడపకూడదు.
* మన మాటలు ఎదుటివారికి విసుగు కలుగచేస్తున్నాయా, వారు ఆసక్తిగా వింటున్నారా అన్న విషయాన్ని గమనిస్తూ, అతిథులు ఇష్టపడే టాపిక్‌నే మాట్లాడాలి.
* అతిథులను సాగనంపే సమయంలో, వారి విలువయినకాలాన్ని అంతసేపు గడిపినందుకు కృతజ్ఞతలు తెలియచేస్తూ, మరోసారి వారు తప్పకుండా రావాలని ఆహ్వానించాలి.

—కె. నిర్మల

# మినీ కథ



## ఆవేదన

నేనిక్కడకు వచ్చి ఆరు మాసాలైంది.

నాలాగే ఎంతోమంది వస్తున్నారు. వెడుతున్నారు. నాకు మాత్రం విముక్తి కలగటం లేదు. వచ్చినకస్టమర్లకి నన్ను చూపిస్తున్నాడు మా ఓనరు. ఇంతరేటులో వద్దండీ అని కొంతమందిఅంటే. ఇంత తక్కువరకం వద్దండీ అని కొంతమంది అంటున్నారు.

చివరకు ఒక పెద్దమనిషి వచ్చి నన్ను ఎంచుకున్నాడు. నాతోపాటు మరికొంత మందిని తీసుకునివెళ్ళేడు ఇంటికి. అక్కడేదేనా శుభకార్యం జరగబోతోందేమో! ఇంటినిండా కిటకిటలాడుతున్నారు జనం. మమ్మల్ని భార్యకు అప్పగించేడు ఆయన. నాలుగురోజులు గడిచేక ఆమె నన్ను వాళ్ళ బంధువులామెతో పంపించింది. ఆమె కూడా కొన్నాళ్ళు తన దగ్గరుంచుకొని ఊళ్ళో ఏదో పేరంటంవస్తే తీసుకుని వెళ్ళి అక్కడ వదిలేసింది. వాళ్ళు నన్ను ఊపిరిఆడకుండా ఓ చోట బంధించేరు.

కొన్నాళ్ళకు వాళ్ళు సత్యనారాయణ వ్రతం చేసుకున్నారు. నన్ను అక్కడ కూర్చోపెట్టేరు. పూజ పూర్తయి పంతులు వెళ్ళిపోతూ నన్ను కూడా తనతో తీసుకుని వెళ్ళిపోయేడు. అతని భార్య నన్ను చూసి ఆనందపడి, తనకు నేను పనికిరానని కూతురుకివ్వాలని అనుకుంది. కొన్నాళ్ళకు కూతురు వచ్చింది.

నన్ను ఆమెతో పంపించింది. ఆమె నన్ను నానాచిత్రహింసలుపెట్టి తనకు కావలసినట్లుగా మలుచుకుంది. ఆమె నన్నుఎంతో అపురూపంగా అక్కున చేర్చుకునేది. ఇంతవరకు అంతా నన్ను చేతితో తాకినవారే. ఈమె సున్నితమైన, సునుపైన శరీరం తగులుతుంటే ఏమిటోలాఉండేది.

ఆమెభర్త నేనున్నానని కూడా చూడకుండా ఆమెతో సరసాలాడేవాడు. నాకు చాలా సిగ్గనిపించేది. వారిద్దరిమధ్య నేను నలిగిపోయేదాన్ని. ఒక్కొక్కసారి అతను నన్ను విసుక్కునేవాడు. వాళ్ళిద్దరి మధ్య నేనేదో దూరంపెంచుతున్నట్లు భావించేవాడు. వారి శృంగారం మితిమీరినప్పుడు ఆమె నన్ను దూరంగానెట్టేది. తరువాత తనే మళ్ళీ అక్కున చేర్చుకునేది.

కొన్నాళ్ళు ఆమె దగ్గర నాకు బాగానే గడిచింది. చిన్న చిన్న గాయాలు తగుల్తున్నాయి. ఆమెకు నేనంటే విసుగు వచ్చినట్లుంది. వాళ్ళ పనిమనిషిని తీసుకుని వెళ్ళమంది నన్ను. పనిమనిషి నన్ను ఇంటికి తీసుకువెళ్ళి, చిన్నచిన్న గాయాలకు చికిత్స చేసింది. ఆమెభర్త రిషా నడుపుతాడు. అక్కడ కొన్నాళ్ళు బాగానేఉంది నాకు.

నాలో శక్తి బాగా తగ్గిపోయింది. ఇదివరకులా దెబ్బలు తగ్గటంలేదు. పెద్దవవుతున్నాయి. ఆమె తనకు పనికిరాననుకుని మూలకు విసిరేసింది. ఒకరోజు ఆమె భర్త నన్ను రిక్షాతుడవడానికి తీసుకుని వెళ్ళేడు. నా పని ఇప్పుడు బాగానే ఉంది. రోజూ అతని రిక్షా శుభ్రంచేయడం, చక్కగా ఊరంతా తిరగడం. ఎంతపని లేకపోయినా నా శరీరం బాగా శుష్కించిపోయింది. ఒకరోజు రిక్షా తుడుస్తుంటే 'ఛీ- నీ అమ్మ నీ వల్ల ఉపయోగంలేదు' అని నన్నురోడ్డుమీదకు విసిరేశాడు. లేచేఓపికలేక ఎండకుఎండుతూ, వానకు తడుస్తూ ఎన్నాళ్ళో ఉన్నాను.

రోడ్డునపోయేవాళ్ళు నన్నుతన్నుకుంటూ పోయేవారు. కొంతమంది నన్ను తాకితేనే మహాపాపమన్నట్లుగా తప్పుకుని వెళ్ళేవారు. ఒకరోజు రోడ్డుతుడుస్తూ నన్ను చీపురుతో ఈడ్చుకుపోయారు. అక్కడ నాలాగే ఎంతోమంది ఉన్నారు. మమ్మల్నందర్నీ ఒకచోట చేర్చి మంట పెట్టేరు. ఈ మనుష్యులింతే అవసరం ఉంటే అందలం ఎక్కిస్తారు. అవసరంతీరితే అవతలకు విసిరేస్తారు. అనుకున్నాం. మా ఆర్తనాదాలు ఎవరికీ వినిపించలేదు. ఆ మంటల్లో మాడిమసైపోయేం.

ఇంతకీ నేనెవరో తెలుసా?

ఒక జాకెట్టు ముక్కను.

—వి. రవిబాపారావు.
(విశాఖపట్నం-17)